క్లుప్తంగా

రాష్ట్ర సీఎస్‌కు సాదర స్వాగతం



సీఎస్‌కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్

రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వ ముఖ్యకార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డికి శనివారం సాయంత్రం రేణిగుంట విమానాశ్రయంలో జిల్లా అధికారులు సాదర స్వాగతం పలికారు. ఆయనకు విమానాశ్రయంలో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, శ్రీకాళహస్తి ఆర్డీఓ రామారావు, ప్రోటోకాల్ అధికారి భాస్కర్‌నాయుడు, చిత్తూరు ఎస్పీ రిషాంత్‌రెడ్డి, తిరుపతి ఏఎస్పీ కులశేఖర్ తదితరులు ఆయనకు పుష్పగుచ్ఛాలను అందించి స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో తిరుపతికి బయల్దేరి వెళ్లారు.

దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఎరువులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

ఏర్పేడు: మండల కేంద్రంలోని ఎరువులు, క్రిమిసంహారక మందుల దుకాణాలపై శనివారం తిరుపతి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు చేశారు. ఎరువుల స్టాక్, అమ్మకాల రిజిస్టర్లను తనిఖీలు చేపట్టారు. ఎరువులు, క్రిమిసంహారక మందులను ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు విక్రయిస్తున్నారా?లేదా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. ఏర్పేడులో రికార్డులు సక్రమంగా లేని రెండు దుకాణాలకు స్టాప్ సేల్ నోటీసులు జారీ చేసినట్లు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జిల్లా అధికారి ఈశ్వర్‌రెడ్డి చెప్పారు.

పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ



మొక్క నాటుతున్న హెచ్‌ఎం రాజేశ్వరి

శ్రీకాళహస్తి: పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ అని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాజేశ్వరి అన్నారు. 1987–88 సంవత్సర పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో పాఠశాల క్రీడామైదానంలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థి రాజేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సిబ్బందికి ప్రశంసలు



ప్రశంసాపత్రం అందజేస్తున్న డిపో మేనేజర్

శ్రీకాళహస్తి: స్థానిక ఆర్టీసీ డిపో పరిధిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులను అధికారులు ప్రశంసించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి అభినందన సభ ఏర్పాటు చేసి, అభినందించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి మేనేజరు రాజవర్ధన్ రెడ్డి చేతుల మీదుగా అవార్డులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ మారయ్య, వైడీ కుమార్, శ్యామ్‌కుమార్, కేసీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థుల మానవహారం



చంద్రుడి ఆకారంలో విద్యార్థులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎంజీఎం పాఠశాల విద్యార్థులు చంద్రయాన్ –3 విజయవంతం కావడంతో శనివారం మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం ర్యాలీ చేశారు. ర్యాలీని ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుడ్లూరు మయూర్ జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని నాలుగు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో చంద్రుడు, రాకెట్ ఆకారంలో మానవహారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం మునిరత్నంనాయుడు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలి



ఏర్పేడు: విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈఓ ప్రేమలత అన్నారు. శనివారం మండలంలోని కొత్తవీరాపురం పంచాయతీ వడ్డిమిట్ట ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. సూర్యనారాయణ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి 8మంది విద్యార్థులు ఎంపిక

శ్రీకాళహస్తి: పట్టణంలోని జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం రాజేశ్వరి తెలిపారు. తమ పాఠశాల నుంచి ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీకి మునితేజశ్రీ, డింపుల్, మునికుమారి, మనస్విని, తేజస్విని, వంశీకృష్ణ, త్రివిక్రమ్, శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటీకి ముని ఢిలీశ్వర్ ఎంపికైనట్లు తెలిపారు. వీరిని టీచర్లు అభినందించారు.

పేదల ఇళ్లపై రాజకీయాలొద్దు

- బస్సుయాత్రకు స్పదన కరువు
- జగనన్న ఇంటి పట్టాలు చూపుతూ మహిళల నిరసన



అన్నాసామిపల్లె జగనన్న కాలనీలో టీడీపీ నేతలకు ఇంటిపట్టాలు చూపుతూ నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

రేణిగుంట: 'భవిష్యత్తుకు గ్యారెంటీ' పేరుతో టీడీపీ చేపట్టిన బస్సుయాత్రకు టీడీపీ ముఖ్యనేతలు ముఖం చాటేయగా, నియోజకవర్గ స్థాయి నేతలతోనే యాత్ర సాగింది. మరోవైపు పలుచోట్ల ప్రజల నుంచి యాత్రకు నిరసనలు ఎదురయ్యాయి. రేణిగుంట నుంచి శనివారం శ్రీకాళహస్తి నియోజకవర్గంలో టీడీపీ బస్సుయాత్ర సాగింది. తొలుత రేణిగుంట తహసీల్దార్ కార్యాలయం పక్కన అన్నాసామిపల్లికి చెందిన జగనన్న కాలనీ ఇళ్లను టీడీపీ నాయకులు పరిశీలించారు. అక్కడ జగనన్న ఇళ్ల లబ్ధిదారులు జగనన్న ఇంటి పట్టాలను చూపుతూ పెద్ద సంఖ్యలో "జగనన్న మా సొంతింటి కల సాకారం చేశారు. పేదల ఇళ్లతో రాజకీయం చేయొద్దు" అంటూ టీడీపీ నాయకులకు హితవు పలికారు. దీంతో వారు అక్కడ నుంచి మెల్లగా జారుకున్నారు. ఆ తర్వాత గాజులమండ్యం ఎస్వీ షుగర్ కర్మాగారానికి చేరుకుని కర్మాగారం ఎదుట విలేకర్ల సమావేశం నిర్వహించి తామే రైతులకు అండగా కోర్టులో కేసులు వేసి షుగర్ ఫ్యాక్టరీ విక్రయం కాకుండా స్టే తెచ్చినట్లు ప్రగల్భాలు పలికారు. అయితే 2014లో టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు గాజులమండ్యం ఎస్వీ షుగర్ ఫ్యాక్టరీ మూతవేశాక, రైతులకు న్యాయం జరగాలని రైతుల పక్షాన వైఎస్సార్ సీపీ న్యాయవిభాగానికి చెందిన హైకోర్టు న్యాయవాది పేరూరు మునిరెడ్డి ఒక్కరూపాయి ఫీజు తీసుకోకుండా కేసు వాదించి చెరకు రైతులకు న్యాయం జరిగేలా స్టే తీసుకొచ్చారు. అయితే తామేదో సాధించినట్లు బొజ్జల సుధీర్‌రెడ్డి చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని చెరకు రైతులు మండిపడుతున్నారు. ఏర్పేడు మీదుగా ఊరందూరు జగనన్న కాలనీకి వెళ్లిన టీడీపీ బృందం అక్కడ పాలోమని పేదలందరూ సొంతిల్లు నిర్మించుకుంటూ కనిపించడంతో అక్కడకు వెళ్లి ఫోటోలకు ఫోజులిచ్చి టీడీపీ బస్సుయాత్ర నేతలు వెనుదిరిగారు. దీంతో బస్సుయాత్ర పేరుతో టీడీపీ నాయకులు నియోజకవర్గంలో చేపట్టిన కార్యక్రమం ఫ్లాప్ షోగా మిగిలింది.

బస్సుయాత్ర సాక్షిగా బయటపడిన వర్గవిభేదాలు

టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బొజ్జల సుధీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు మధ్య నెలకొన్న విభేదాలు బస్సుయాత్ర సాక్షిగా బయటపడ్డాయి. బస్సుయాత్ర అన్నాసామిపల్లెకు చేరుకున్నాక, బస్సులో ఉన్న తమ నాయకుని కోసం ఎస్సీవీ అనుచరుడు శివ బస్సు ఎక్కేందుకు ప్రయత్నించగా, అక్కడే ఉన్న బొజ్జల సుధీర్‌రెడ్డి వర్గీయులు అడ్డుకున్నారు. సుధీర్‌రెడ్డి వచ్చే వరకు ఎవరూ బస్సు ఎక్కకూడదని అతనిని దింపేశారు. దీంతో ఇద్దరి మధ్య మాటా,మాటా పెరిగి సుధీర్‌రెడ్డి వర్గీయులు శివపై చేయిచేసుకున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సీవీ మనస్తాపానికి గురై బస్సులో నుంచి కిందకు దిగేశారు.

రాష్ట్ర గవర్నర్‌కు ముక్కంటి ప్రసాదాలు



గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు జ్ఞాపిక అందజేస్తున్న అంజూరుతారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు శనివారం శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ముక్కంటి ప్రసాదాలను అందజేశారు. తిరుపతి పర్యటనలో భాగంగా శ్రీపద్మావతి అతిథిగృహంలో బస చేసిన ఆయన్ని మర్యాదపూర్వకంగా కలిసి ముక్కంటి దుశ్శాలువాతో సన్మానించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలను అందజేశారు. శ్రీకాళహస్తీశ్వరాలయ దర్శనానికి విచ్చేయాలని గవర్నర్‌ను అంజూరు తారక శ్రీనివాసులు కోరారు. మరోసారి తిరుపతి పర్యటనకు వచ్చినపుడు తప్పకుండా వస్తానని గవర్నర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కొళ్లూరు హరినాథ్‌నాయుడు, కంఠా ఉదయ్, భాస్కర్‌ముదిరాజ్ పాల్గొన్నారు.

నేటి నుంచి ఐసీఏఆర్ 95వ వ్యవస్థాపక దినోత్సవం

రేణిగుంట: మండలంలోని కరకంబాడి పంచాయతీ వనస్థలిలో ఉన్న రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి(ఐసీఏఆర్) 95వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈనెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆదివారం తిరుపతి ఎంపీ మద్దెల గురుమూర్తి, జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. మూడు రోజుల కార్యక్రమంలో వ్యవసాయంలో నూతన సాంకేతికతపై వ్యవసాయ ప్రదర్శనను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఉద్యాన, పశువైద్య, అనుబంధ శాఖలకు సంబంధించిన శాస్త్రవేత్తలు, అధికారులు పాల్గొని ఖరీఫ్ పంటల్లో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను గురించి రైతులకు అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. సేంద్రియ వ్యవసాయం, చిరుధాన్య పంటల సాగు, వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, పాడి పశువుల పోషణలో మెళకువలు, వ్యవసాయ యాంత్రీకీకరణ, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించనున్నారు. ఈ కార్యక్రమానికి తిరుపతి, చిత్తూరు జిల్లాలకు చెందిన రైతులు హాజరై వ్యవసాయ సాగుకు అవసరమైన సమాచారం తెలుసుకోవాలని కోరారు.

మహిళల భద్రతకు వజ్రాయుధం 'దిశ'



సమావేశంలో మాట్లాడుతున్న ఉమాదేవి

రేణిగుంట: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న దిశ యాప్ మహిళలు, యువతుల భద్రతకు వజ్రాయుధం లాంటిదని పద్మావతి మహిళావర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ డి.ఉమాదేవి అన్నారు. రేణిగుంట ఐకేపీ కార్యాలయంలో శనివారం స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు దిశయాప్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళలపై జరుగుతున్న దాడులు, అఘాయిత్యాలు, అత్యాచారాలు, నేరాలను రూపుమాపేందుకు ఎస్‌ఓఎస్ బటన్ నొక్కితే ఆ ప్రాంతంలోకి పోలీసులు వెంటనే చేరుకుంటారన్నారు. ప్రతి మహిళ తన మొబైల్ ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం మహిళా అధ్యయన కేంద్రం రీసెర్చ్ అసిస్టెంట్ ఎం.ఇంద్రాణి, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సామాన్యులకు రక్ష



కాంబాకం సచివాలయంలో లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం



పెరిందేశంలో సర్టిఫికెట్లు పంపిణీ చేస్తున్న నేతలు, అధికారులు

వరదయ్యపాళెం: జగనన్న సురక్ష కార్యక్రమం సామాన్య ప్రజలకు రక్షగా నిలుస్తోందని స్థానిక ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అన్నారు. మండలంలోని కాంబాకం సచివాలయ ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష శిబిరంలో ఎమ్మెల్యే మాట్లాడారు. సాంకేతిక సమస్యల కారణంగా పథకాలు ఆగిపోయిన వారిని గుర్తించి వారికి మళ్లీ పథకాలను పునరుద్ధరించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టారని వివరించారు. సచివాలయ పరిధిలో ప్రభుత్వం నిర్దేశించిన 11 సేవలకు సంబంధించి 619 మందికి ఒకే సారి మంజూరు పత్రాలను ఎమ్మెల్యే చేతులమీదుగా లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో ప్రజలను ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ ముందుచూపుతో ప్రజల ముంగిటకే సంక్షేమం అందజేస్తుంటే ఓర్చుకోలేని ప్రతిపక్షం దత్తపుత్రుడు, దత్త తండ్రి దుష్ట చతుష్టయం అయిన ఎల్లో మీడియా ద్వారా ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తోందన్నారు. వారి కుట్రలను రానున్న ఎన్నికల్లో ప్రజలు తిప్పి కొట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రాన్ని అభివృద్ధిలో సైతం అగ్రగామిగా నిలిపేందుకు అహర్నిశలు కృషి చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రజలు సహకరించాలన్నారు. అనంతరం లోక ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇస్తరాకుల తయారీ ప్లాంట్‌ను సందర్శించి తద్వారా ఉపాధి పొందుతున్న గిరిజనులతో మాట్లాడారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదరరెడ్డి, దేవాంగ కార్పొరేషన్ డైరెక్టర్ తిలక్‌బాబు, సింగిల్‌విండో చైర్మన్ హరిబాబురెడ్డి, జేసీఎస్ కన్వీనర్ చిన్న, సర్పంచులు దీప, శ్రీధర్‌రెడ్డి, దుద్దు వేణు, ఎంపీటీసీ మహేంద్ర, ఎంపీడీవో సుబ్రహ్మణ్యంరాజు, తహసీల్దారు గౌరీశంకర్‌రావు, సీడీపీవో దేవకుమారి తదితరులు పాల్గొన్నారు.

గురువుల బాధ్యత అనిర్వచనీయం

నారాయణవనం: సమాజానికి బాధ్యతాయుత భావితరాన్ని అందించి, తద్వారా అన్ని రంగాలలో సాధించే ప్రగతిలో గురువుల బాధ్యత అనిర్వచనీయమని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. ఇన్‌చార్జి ఎంఈవోగా పనిచేసిన భారతి సన్మాన సభ శనివారం సాయంత్రం విద్యా వనరుల కేంద్రంలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆదిమూలం మాట్లాడుతూ ఈ సంఘంలో గుర్తింపును తెచ్చి పెట్టేది విద్యేనని చెప్పారు. చదువు విలువ తెలిసిన సీఎం జగన్ విద్యకు ప్రాముఖ్యత ఇస్తున్నారని గుర్తు చేశారు. కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడులను తీర్చిదిద్ది పేద విద్యార్థులకు ఇంగ్లీష్ మీడియం చదువులను అందుబాటులోకి తీసుకువచ్చారని అన్నారు. మండలానికి బదిలీపై వచ్చిన ఏఈఓలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామిని శాలువ కప్పి సత్కరించారు. కార్యక్రమంలో జడ్పీ ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సుమన్‌కుమార్, ఎంపీడీవో గుణశేఖర్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ సొరకాయలు, జేసీఎస్ కన్వీనర్ బాబు, చిన్నదొరై, కోన చైర్మన్ సుబ్రమణ్యం, మాజీ చైర్మన్ భాస్కర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

1,700 మందికి సర్టిఫికెట్ల పంపిణీ

కేవీబీపురం: మండలంలోని అర్హులైన 1700 మందికి వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. పెరిందేశం, రాయపేడు గ్రామ సచివాలయాల్లో శనివారం ఎంపీడీవో రామచంద్ర అధ్యక్షతన జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. రాయపేడు సచివాలయ పరిధిలో 1,017 సురక్ష సర్టిఫికెట్లు పంపిణీ చేయగా, పెరిందేశంలో 693 సర్టిఫికెట్లను పార్టీ నేతలు, అధికారులు పంపిణీ చేశారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలోని ప్రజలు జగనన్న సురక్ష ద్వారా అవసరమైన సర్టిఫికెట్లను పొందాలని సూచించారు. ఇదే విషయమై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఇద్దరు వలంటీర్లపై చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో రామచంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్‌ఎంపీపీ శ్రీనివాసయాదవ్, నేతలు నందకుమార్, లాలుబాబుయాదవ్, మాన్యం వెంకటేశ్వర్లు, కన్వీనర్లు శాస్త్రీ రాజు, సుబ్బారామనాయుడు, మాధవయ్య, నాగేష్, స్థానిక సర్పంచ్ మురగమ్మ, ఎంపీటీసీ అను తదితరులు పాల్గొన్నారు.

సురక్ష శిబిరాల్లో సర్టిఫికెట్ల పంపిణీ

పిచ్చాటూరు: మండల కేంద్రంలోని సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష శిబిరం ద్వారా శనివారం 820 సర్టిఫికెట్లను పంపిణీ చేసినట్లు సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి వెల్లడించారు. ఇందులో కులం 406, ఆదాయం 328, మ్యుటేషన్ 6, రేషన్ కార్డు 10, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు 2, ఓబీసీ సర్టిఫికెట్లు 4, కౌలు రైతు సర్టిఫికెట్లు 3, ఆధార్‌కు మొబైల్ లింకింగ్ 61 పంపిణీ చేసినట్లు ఆయన వివరించారు. కార్యక్రమంలో తహసీల్దారు మధుసూదన్ రావు, ఎంపీడీఓ శ్రీనివాసులు, ఏఓ సంజీవ రెడ్డి, ఎంఈఓలు హేమమాలినీ, యుగంధర్ రాజు, ఉపాధి ఏపీఓ సుధాకర్, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం వనిత, ఈఓపీఆర్‌డీ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి రాధిక తదితరులు పాల్గొన్నారు.

563 సర్టిఫికెట్ల పంపిణీ

నాగలాపురం మండలం బీరకుప్పం సచివాలయంలో జగనన్న సురక్ష పథకం ద్వారా శనివారం సర్టిఫికెట్ల పంపిణీని అధికారులు, ప్రజాప్రతినిధులు చేపట్టారు. సచివాలయ పరిధిలోని మొత్తం 563 సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీఓ పద్మజ తెలిపారు. ఇందులో కులం సర్టిఫికెట్లు 194, ఆదాయం 294, ఆధార్‌కు మొబైల్ లింకింగ్ 48, కొత్త రేషన్ కార్డులు 3, రేషన్ కార్డు స్ప్లిట్టింగ్ 23, మ్యుటేషన్ సర్టిఫికెట్లు 3 ఉన్నట్లు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పద్మజ తహసీల్దారు ప్రసన్నకుమార్, సింగిల్ విండో చైర్మన్ అపరంజిరాజు, రైతు సలహా మండలి చైర్మన్ చిన్నదొరై, సింగిల్ విండో డైరెక్టర్ షాబుద్దీన్, కులశేఖర్ రెడ్డి, అలగేశన్, సర్పంచ్‌లు హైమావతి, వైస్ ఎంపీపీ జాయిస్, సచివాలయ మండల కన్వీనర్ మోహన్ మొదలి, వైఎస్సార్ టీయూసీ నియోజకవర్గ చైర్మన్ ఎస్‌ఎం సురేష్, నాయకులు మహేష్ రెడ్డి, శ్యామ్, డానియేల్ తదితరులు పాల్గొన్నారు.



నాగలాపురం : బీరకుప్పంలో సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులతో అధికారులు



పిచ్చాటూరు : సర్టిఫికెట్లు పొందిన లబ్ధిదారులతో సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి, అధికారులు



ధ్రువపత్రాలను అందజేస్తున్న అంజూరు తారక శ్రీనివాసులు

జగనన్న సురక్ష ప్రజలకు రక్ష

శ్రీకాళహస్తి: జగనన్న సురక్ష ప్రజలకు రక్ష అని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు అన్నారు. పట్టణంలోని కొండమిట్టలోని 24వ వార్డు సచివాలయంలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అంజూరు శ్రీనివాసులు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పురపాలక సంఘం ఇన్‌చార్జి కమిషనర్ ఉమామహేశ్వరరావు, పార్టీ కన్వీనర్లు ఆశా కిరణ్, విజయకుమార్, లక్ష్మి ఆధ్వర్యంలో ప్రజలకు సర్టిపికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంజూరు మాట్లాడు తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు పలు సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. ప్ర జల గుండెల్లో జగన్‌మోహన్‌రెడ్డి స్థిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. సచివాలయాల ఇన్‌చార్జి మల్లికార్జున్‌గౌడ్, అధికారులు లలిత, శ్రీనివాసులు, బాలచంద్రయాదవ్, రవికాంత్, భాస్కర్ పాల్గొన్నారు.

భక్తి ప్రపత్తులతో మహాప్రదోష పూజలు



సురుటపల్లిలో విశేషాలంకరణలో నందీశ్వరుడు



సిద్ధిరాజుకండ్రిగ శ్రీ సోమనాథేశ్వరాలయంలో ప్రదోష పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పిచ్చాటూరు: నాగలాపురం మండలం సురుటపల్లి శ్రీ పల్లికొండేశ్వరాలయంలో శనిత్రయోదశిని పురస్కరించుకొని మహా ప్రదోష పూజలు భక్తి ప్రపత్తులతో నిర్వహించారు. పక్షం రోజులకోసారి వచ్చే త్రయోదశి నాడు ఈ ఆలయంలో శివునికి ప్రీతిమంతుడైన నందీశ్వరునికి ప్రదోష పూజలు భక్తుల నడుమ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. అయితే శనివారం రోజు త్రయోదశి రావడం ప్రదోష పూజలకు అత్యంత విశేషం. ఇందులో భాగంగా సాయంత్రం ఆలయంలోని స్వయంభు శ్రీ వాల్మీకేశ్వర స్వామికి అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి పాలు, పెరుగు, కొబ్బరినీళ్ళు, చందనం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో నందీశ్వరుని సుందరాంగంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. వివిధ రకాల పండ్లను నైవేద్యంగా సమర్పించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలు, మంగళవాయిద్యాలు నడుమ నందీశ్వరునికి కొబ్బరి కాయలు కొట్టి కర్పూర హారతులతో నైవేద్యం సమర్పించారు. అంతకు ముందు ఆలయంలో కొలువుదీరిన దేవతామూర్తులకు ప్రత్యేక అభిషేక పూజలు చేసి అందంగా అలంకరించారు. చివరగా శివపార్వతుల ఉత్సవమూర్తులతో ఆలయ ప్రాకారోత్సవం నిర్వహించారు. శని మహా ప్రదోష పూజలకు మన రాష్ట్రంతో పాటు తమిళనాడు కర్ణాటక రాష్ట్రాల నుండి భక్తులు భారీగా తరలివచ్చారు. ప్రదోష పూజల ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ ఏపీఎం బాలాజీ రెడ్డి, ఈఓ రామచంద్రా రెడ్డి, సభ్యులు, సిబ్బంది పర్యవేక్షించారు.

సోమనాథేశ్వరాలయంలో..

పిచ్చాటూరు మండలం సిద్ధిరాజుకండ్రిగ శ్రీ గౌరీ సమేత సోమనాథేశ్వర ఆలయంలో మహా ప్రదోష పూజలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు ఆలయంలోని శ్రీ సోమనాథేశ్వరుని అభిముఖంగా ఉన్న నందీశ్వరునికి పంచామృతాలతో అభిషేకించి, పలు రకాల పుష్పాలతో విశేష అలంకరణలు చేశారు. అనంతరం మహా హారతి సమర్పించారు. చివరగా శివపార్వతుల ఉత్సవమూర్తుల ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించి ఆశీర్వచనాలు పలికారు. ఏర్పాట్లను ఆలయ ధర్మకర్త జ్యోతిరాజు పర్యవేక్షించారు.

బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలి



మొక్కలచేను గిరిజనకాలనీలో తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కల్లివెట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిఈడు పిల్లలను చేర్పించాలని ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ తెలిపారు. ఆయన శనివారం ఉపాధ్యాయులతో పాఠశాల పరిధిలోని మొక్కలచేను, గాంధీ గిరిజన కాలనీలను సందర్శించి, వారి తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ, విద్యాకానుకకు వేలిముద్రలు వేయించారు. ఆయన మాట్లాడుతూ పాఠశాల విద్యార్థుల సంఖ్యను పెంచడమే కాకుండా బడి బయట పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలలో చేర్పించే విధంగా తల్లిదండ్రులను చైతన్య పరస్తున్నారమన్నామని తెలిపారు. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతోపాటుగా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు, అందించడంతోపాటు రుచికరమైన పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు. పది పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల మార్కుల కరపత్రాలను పంచారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం



కన్నావరంలో సజ్జ పంటకు సోకిన తెగులు నివారణపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

సత్యవేడు: చిరుధాన్యాలను రోజువారీ ఆహారంలో తీసుకుంటే ప్రజల ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని తిరుపతి జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. ఆయన శనివారం కన్నావరం పంచాయతీలో చిరుధాన్యాల సాగు వినియోగంపై రైతులకు శిక్షణ ఇచ్చారు. చిరుధాన్యాలతో మధుమేహం, గుండెజబ్బులు, మానసిక రోగాలు, ఊబకాయం వంటి జీవన శైలి వ్యాధులను అదుపులో ఉంచకోవచ్చన్నారు. గ్రామ పరిధిలోని నేల సజ్జపంటకు అనుకూలంగా ఉందని, ఈ పంట సాగుకు ప్రభుత్వం సహాయ సహకారాలు అందిస్తుందని రైతులకు వివరించారు. సజ్జ పంట వినియోగంపై వ్యవసాయ అధికారి వేణుగోపాల రావు వివరంగా రైతులకు తెలిపారు. అంతకు ముందు రైతులు సాగు చేస్తున్న సజ్జ పంటను సందర్శించారు. సజ్జపంటను నష్టపరుస్తున్న కత్తెరపురుగును నియంత్రించేందుకు పొలం చుట్టూ జొన్న పంటను రెండు మూడు వరుసలు సాగు చేయాలన్నారు. పురుగు తొలిదశలో ఉందని గుర్తించారు. నివారణకు యమామెక్టిన్ బెంజోమేట్‌ను ఎకరాకు 100గ్రా ,200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈ మురళి, వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


ఉపాధిలో అవినీతిపై విచారణ జరపండి



ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న యువత

కేవీబీపురం: మండలంలోని పెరిందేశం గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకంలో చోటుచేసుకున్న అవినీతిపై విచారణ జరిపించాలని స్థానికులు ఎంపీడీవో రామచంద్రకు శనివారం ఫిర్యాదు చేశారు. పెరిందేశం సచివాలయంలో నిర్వహించిన గ్రామసభకు ఎంపీడీవో ముఖ్య అతిథిగా విచ్చేశారు. స్థానిక యువత గ్రామంలో ఇటీవల జరిగిన ఉపాధిపనులపై విచారణ జరపాలని కోరారు. గత ఆరు నెలల్లో గ్రామంలోని కేవలం నలుగురు వ్యక్తులు సుమారు 200 మందికి సంబంధించిన ఉపాధి పనులను లబ్దిదారుల ద్వారా కాకుండా బినామీ వ్యక్తులతో చేయించారని ఇదే క్రమంలో రాత్రి పూట జేసీబీ యంత్రాలతో ఉపాధి పనులు నిర్వహించారని ఎంపీడీవోకు ఫిర్యాదు చేశారు. దీనిపై ఎంపీడీవో స్థానిక యువతకు ఆయా వివరాలను తెలిపి, ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణకు ఆదేశించారు.

మామా అల్లుళ్ల బాగోతం చాంతాడంత



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

శ్రీకాళహస్తి: టీడీపీ నాయకులు రాంబాబునాయుడు, ఆయన అల్లుడు రంగినేని చెంచయ్యనాయుడు అవినీతి బాగోతం బయటకు తీస్తే చాంతాడంత ఉంటుందని మన్నవరం వైఎస్సార్ సీపీ నేతలు విమర్శించారు. శనివారం వారు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉండగా వారు గ్రామంలో చేసిన దౌర్జన్యకాండను రుజువులతో సహా నిరూపిస్తామన్నారు. మామాఅల్లుళ్లపై ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అక్రమ కేసులు పెట్టాడనం అవాస్తవమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు గిరి, జయరామనాయుడు, మధుసదన్‌రావు, కోటీవ్వరరావు, హరీష్, నరేష్, మిల్క్ సొసైటీ చైర్మన్ మధుసూదన్ రావు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



జస్టిస్ భానుమతికి స్వాగతం పలుకుతున్న ఈఓ సాగర్‌బాబు



ఆలయ ధ్వజస్తంభం వద్ద రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం పలువురు ప్రముఖులు వేర్వేరు సమయాల్లో దర్శించుకున్నారు. రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ భానుమతి, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ దర్శించుకున్న వారిలో ఉన్నారు. వారికి ఆలయ దక్షిణ గోపురం వద్ద పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈఓ సాగర్‌బాబు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం పలికారు. స్వామి అమ్మవార్ల జాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.